AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
20-7-2026 (Monday)
MAIN EDITION

## షరతులు ఒప్పుకుంటే దీక్షా విరమిస్తా: వాంగ్‌చుక్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ, దేశ విద్యావ్యవస్థలోని లోపాలపై 20 రోజులకు పైగా నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన, తాను దీక్షను విరమించేందుకు సిద్ధంగా ఉన్నానని, అయితే ప్రభుత్వం , రాజకీయ పార్టీలు తమ మూడు ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. దేశ విద్యావ్యవస్థలో జరుగుతున్న వైఫల్యాలకు, ముఖ్యంగా ఇటీవల జరిగిన నీట్ పేపర్ లీకేజీలకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి.

## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. హర్ముజ్‌లో నౌకలపై ఇరాన్ దాడులతో ముడి చమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. దీంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 442 పాయింట్లు నష్టపోయి 77,708 వద్ద, నిఫ్టీ 95 పాయింట్ల నష్టంతో 24,238 వద్ద ముగిశాయి.

## కలకలం రేపుతున్న ఎబోలా..




అక్షరటుడే, నేషనల్‌డెస్క్: కాంగో దేశంలో ఎబోలా వైరస్ మహమ్మారి తీవ్రరూపం దాల్చింది. ప్రాణాంతక వ్యాధి వేగంగా వ్యాపిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తోంది. మే 15 నుంచి శనివారం నాటికి దేశవ్యాప్తంగా 2,344 కేసులు నమోదయ్యాయి. వైరస్ బారిన పడి ఇప్పటికే 930 మంది ప్రాణాలు కోల్పోయారు. కేవలం శుక్రవారం ఒక్కరోజే 37 మరణాలు సంభవించాయి.

## పోచారంను ఓడించాలి



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఓడించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రహచారం బాగాలేక పోచారం కాంగ్రెస్‌లోకి పోయారని విమర్శించారు. మునిగిపోయే పడవ ఎక్కారని, ఇవ్వాళ కుడితిలో పడ్డ ఎలుక లెక్క అయ్యారని ఎద్దేవా చేశారు.

## బీఆర్ఎస్ నేత జీవన్‌రెడ్డి అరెస్ట్



అక్షరటుడే, కరీంనగర్: చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలంలో సాగునీరు అందక నారు మడులు ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన చేపట్టారు. వరద కాలువ ద్వారా నీరు విడుదల చేయాలని ధర్నా చేశారు. రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను పోలీసులు అడ్డుకున్నారు.



ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనతో సోమవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా సీజేపీ ఆధ్వర్యంలో పార్లమెంట్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో పెద్ద ఎత్తున కార్యకర్తలు, మద్దతుదారులు, యువత జంతర్‌మంతర్ వద్దకు తరలి వచ్చారు. అయితే పార్లమెంట్ ముట్టడికి పోలీసులు అనుమతించలేదు. అయినా ఆందోళనకారులు ర్యాలీ తీయడానికి యత్నించడంతో హైటెన్షన్ నెలకొంది.

- అక్షరటుడే, నేషనల్‌డెస్క్

# పార్లమెంట్ ముట్టడి ఉద్రిక్తం

▪ సీజేపీ ఆందోళనతో హైటెన్షన్ ▪ నిరసనకారులపై లాఠీఛార్జీ ▪ భారీగా బలగాల మోహరింపు

జంతర్‌మంతర్ వద్ద గుమిగూడిన వారిని అదుపు చేయడానికి పోలీసులు యత్నించారు. ఈ క్రమంలో వారిపై లాఠీచార్జ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. భారీ సంఖ్యలో ఉన్న నిరసనకారులకు, వారిని అడ్డుకునేందుకు భారీగా మోహరించిన భద్రతా బలగాలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. రాజధానిలో అల్లర్లను అదుపు చేసే భద్రతా సిబ్బందిని మోహరించారు.

### సోనమ్ వాంగ్‌చుక్ భార్య ఆధ్వర్యంలో..

నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఆయనను పోలీసులు బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. అయినా కూడా సోనమ్ ఆస్పత్రిలో దీక్ష కొనసాగిస్తున్నారు. దీంతో ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ చేపట్టారు.

### టియర్ గ్యాస్ ప్రయోగం

జంతర్ మంతర్ వద్ద ఉదయం నుంచే భారీగా పోలీసులు మోహరించారు. పలువురు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. పెద్ద ఎత్తున వచ్చిన నిరసనకారులపై లాఠీఛార్జీ చేశారు. అనంతరం ఆందోళనకారులు పార్లమెంట్ వైపు ర్యాలీగా బయలుదేరారు. అనుమతి నిరాకరించినప్పటికీ ఆందోళనకారులు బారీకేడ్లను దాటుకొని పార్లమెంట్ వైపు వస్తుండడంతో పోలీసులు వారిపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. దీంతో ఆందోళనకారులు పరుగులు తీశారు. బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించడంతో కొందరు నిరసనకారులు, పోలీసు సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు.

### హై అలర్ట్

వేల మంది ఆందోళనకారులు ర్యాలీగా రావడంతో పోలీసులు పార్లమెంట్ వద్ద హై అలెర్ట్ ప్రకటించారు. భద్రతా సిబ్బంది పార్లమెంట్ గేట్లు మూసి వేశారు. బయట ఫైర్ బ్రిగేడ్లతో పోలీసుల మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. పలువురు ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు.

## అంతరిక్షంలో భారత యువత విజయం..: ప్రధాని



**అక్షరటుడే, న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. లోక్‌సభకు వెళ్లే ముందు ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశాలు దేశాభివృద్ధికి ఎంతో కీలకమని అభివర్ణించారు. నెల రోజులుగా దేశంలో జరిగిన సానుకూల పరిణామాలను ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ముఖ్యంగా భారత అంతరిక్ష రంగంలో యువత సాధించిన విజయాలను ఆయన కొనియాడారు. 'స్కై రూట్' సంస్థ ద్వారా 28 ఏళ్ల యువకులు అంతరిక్షంలోకి రాకెట్‌ను విజయవంతంగా పంపడాన్ని ప్రధాని ప్రశంసించారు. దేశాభివృద్ధిలో అధికార, ప్రతిపక్షాల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ప్రధాని ఉద్ఘాటించారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా, అర్థవంతంగా సాగాలని ఆయన కోరారు.

## మహిళలకు రక్షణ కరువు : హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్ :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఆస్పత్రిలో ఇటీవల ప్రసవించిన బాలింతలు అనారోగ్యానికి గురయ్యారు. ఈ నెల 13న సిజేరియన్ వికటించి ఐదుగురు బాలింతలకు తీవ్ర అస్వస్థత చోటు చేసుకోగా.. నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వారిని మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం పరామర్శించారు. బాధితుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు రక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో బాలింతలకు ఇన్‌ఫెక్షన్ సోకిందన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులు అవుతున్నా.. ప్రభుత్వం, అధికారులు స్పందించడం లేదని ఆయన మండిపడ్డారు.



## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం చేశారు. హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న కృష్ణారెడ్డిపై మహిళా ట్రైనీ ఐపీఎస్ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు వారాలుగా లైంగికంగా వేధించాడని, శారీరకంగా దాడి చేశాడని, బ్లాక్‌మెయిల్ చేశాడని ఆరోపించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తన ప్రైవేట్ వీడియోను రహస్యంగా రికార్డ్ చేసి తన భర్తకు పంపించాడని ఆ మహిళా అధికారి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఉదయం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆయనను కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు సమాచారం.

## చార్‌ధామ్ యాత్ర నిలిపివేత

**అక్షరటుడే, ఉత్తరాఖండ్:** ఉత్తరాఖండ్‌లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకమైన చార్ ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. యాత్ర మార్గాల్లోని రహదారులు ప్రయాణానికి సురక్షితంగా లేకపోవడంతోనే ఈ ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు యంత్రాంగం తెలిపింది. యాత్ర మార్గంలో ప్రస్తుతం ప్రయాణిస్తున్న భక్తులను గుర్తించి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించింది.



## 'నీట్' పేపర్ లీకేజీకి నిరసనగా ఎస్పీ ఎంపీల పాదయాత్ర




**అక్షరటుడే, ఢిల్లీ :** నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీకి నిరసనగా సమాజ్‌వాది పార్టీ ఎంపీలు సోమవారం నిరసన తెలిపారు. పార్లమెంట్ నుంచి జంతర్‌మంతర్ వరకు పాదయాత్ర చేశారు. ఎస్పీ చీఫ్, ఎంపీ అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. ఇది ప్రభుత్వం కాదు, 'అహంకారం' అన్నారు. పేపర్ లీకేజీతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఎవరు సంతాపం తెలపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ డింపుల్ యాదవ్ మాట్లాడుతూ.. యువత తమ ఆందోళనలను వినిపించాలనుకుంటున్నారు, కానీ ప్రభుత్వం వినడానికి, చర్చలకు నిరాకరిస్తోందన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ కూడా చర్చలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం చాలా కఠినంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇతరుల అభిప్రాయాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

## త్రిపుర డీజీపీ ఆత్మహత్య




**అక్షరటుడే, త్రిపుర:** త్రిపుర రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) అనురాగ్ ధన్కర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక సమాచారం . సోమవారం ఉదయం ఆయన మృతదేహాన్ని అగర్తలాలోని జీబీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఆకస్మిక మరణం త్రిపుర పోలీస్ శాఖలో, రాష్ట్ర పరిపాలనా వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని నింపింది. 1994 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన అనురాగ్ ధంకర్, గత సంవత్సరం మే నెలలో త్రిపుర డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మరణానికి గల కచ్చితమైన కారణాలు తెలియరాలేదు.

## ఫిఫా వరల్డ్ కప్ విజేతకు రూ.420 కోట్ల ప్రైజ్ మనీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఫిఫా వరల్డ్ కప్ విజేతగా స్పెయిన్ నిలిచిన విషయం తెలిసిందే. కప్ గెలిచిన ఆ దేశానికి రూ.420 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. రన్నరప్ అర్జెంటీనాకు రూ.277 కోట్ల ప్రైజ్‌మనీ రానుంది. న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో స్పెయిన్ ఘన విజయం సాధించింది. నిర్ణీత సమయంలో రెండు జట్లు గోల్ చేయలేకపోయాయి. అదనపు సమయంలో స్పెయిన్ గోల్ కొట్టి మ్యాచ్ గెలిచింది. ఆ దేశ ఆటగాడు ఫెర్రాన్ టోర్రెస్ ఈ ఏడాది ప్రపంచ కప్‌లో తన మొదటి గోల్‌ను సాధించడంతో పాటు దేశానికి కప్‌ను అందించాడు. స్పెయిన్‌కు ఇది రెండో ప్రపంచ కప్. 2010లో ఆ దేశంలో తొలిసారి కప్ గెలిచింది.

## దీక్ష విరమించిన అభిజీత్ దీప్కే



**అక్షరటుడే, ఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజీత్ దీప్కే జంతర్ మంతర్ వద్ద తన నిరాహార దీక్షను విరమించారు. ఆసుపత్రిలో ఉన్న కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభ్యర్థన మేరకు సోమవారం ఉదయం దీక్షను విరమించారు. నిరసనను కొనసాగించడానికి శక్తి అవసరమని భావించి, తన దీక్షను విరమించాలని వాంగ్‌చుక్ కోరారని ఆయన భార్య గీతాంజలి అంగ్మో జంతర్ మంతర్ నిరసన వేదికపై ప్రకటించిన తర్వాత దీప్కే జ్యూస్ తాగారు. ఆ వెంటనే దీప్కే, అంగ్మో పార్లమెంట్ వైపు సాగుతున్న నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.